

"నువ్వు వంద చెప్పు — వెయ్యి చెప్పు — ఆయనకూ, నాకూ ఇహ పడదు. నీవే దిక్కంటూ దేబిరిస్తూ అక్కడకు పోవాల్సిన అగత్యం నాకేం లేదు." ఆవేశంతో రెచ్చిపోతూ అంది లలిత.

"నీ ఇంటికి నువ్వు పోవటం దేబిరింపా? నీ కాపురాన్ని నువ్వు నిలుపుకోవటం మరొకరి నుద్ధరించినట్లా? ప్రశాంతంగా ఆలోచించు, లలితా. ఎంత కాలం ఇట్లా ఎడముఖం పెడముఖంగా ఉండిపోతావు?" అనునయిస్తూ అంది పద్మ.

"అట్లా అని ఆయన అన్నవల్లా పడుతూ, తల వంచి బ్రతకాల్సిన దుర్గతి నాకేం లేదు."

"లలితా, ఆలు మగ లన్నాక ఏవో అభిప్రాయ భేదా లొస్తాయి. ఒకరి కొకరు సర్దుకుపోవాలి. ఇట్లా కయ్యాలాడుకొని కాపురాన్ని పాడు చేసుకొంటారా? పైగా నువ్వు చదువుకున్న దానివి."

"కాబట్టే నా బ్రతుకు కేదో నేను బ్రతకదలుచుకున్నాను."

"కాలం గడిచినకొద్దీ నీ తొందరపాటెంతటిదో నీకు తెలిసొస్తుంది. తన వాడనుకొన్న వ్యక్తి నీడలో గడపటమే ఆడదానికి వరం. ఏ ఆకర్షణైనా, ఆత్మ తృప్తైనా నీ భర్తతో ఉన్నప్పుడే. అదే లేనప్పుడు ఎన్ని ఉన్నా లేనట్లే. అసలు కావాలని మీరు పెళ్ళి చేసుకున్నారు. ముగ్గురు వారసుల్ని కన్నారు. ఇట్లా విడివిడిగా ఉండటంలో విజ్ఞత ఉందా! జాగ్రత్తగా ఆలోచించు, లలితా!"

"అక్కడకు నీ వేదో అదృష్టవంతురాలవైనట్లూ, ఏ సమస్యలూ లేక నీ బ్రతుకు సాగిపోతున్నట్లూ మాట్లాడకు. కొట్టినా, తిట్టినా సరిపెట్టుకొనే మన స్తత్త్వం నేనూ అలవరుచుకొంటే నీ లాగా పదిమందికీ నీతు లంటిస్తూ తిరిగేదాన్నే."

పద్మ మనసు కష్టపడింది. స్నేహితురాలున్న పరిస్థితి తలుచుకొని తన బాధను దిగమింగుకొంది.

"లలితా, నీ మీద నా కున్న చనువుకొద్దీ, అభిమానంకొద్దీ నా ధర్మంగా చెప్పవలసినవి చెప్పాను. నీ జీవితాన్ని మళ్ళీ మామూలుగా మలుచుకోగలవన్న ఆశతో నీ కిబ్బంది కలిగించాను. నువ్వు బాగుంటే చూసి సంతోషించాలన్నదే నా ఉద్దేశ్యం."

"ఈ విషయంలో నిన్ను నిరాశ పరుస్తున్నాను, పద్మా."

పద్మ నిట్టూర్పు విడిచింది. జాలిగా ఒక్క క్షణం లలిత వైపు చూసింది. లలిత పట్టుదల ఏ అనర్థానికి దారి తీస్తుందో అన్న బెంగతో ఆమె హృదయం భారమైంది.

"నే వెళ్ళిరానా, లలితా?"

"రెండు రోజు లుంటావుగా?"

"ఆఁ. రేపు మళ్ళీ కలుస్తా."

పద్మ వెళ్ళిపోయింది. 'దీని కింకా పాతకాలపు వాసన పోలేదు' అనుకొంది లలిత. పైకి నిబ్బరంగా కనిపిస్తున్నా, లలిత గుండెలోనూ ఏదో వెలితి గూడు కట్టుకొంది. మనసు అరల్నిండా ఎన్నో ప్రశ్నలు. 'ప్రభాకరానికి దూరమై తాను బ్రతకలేదా? బ్రతికినా శాంతికి నోచుకోలేదా? ఎండమావిలో నిత్య వసంతం కోసం ఆరాటపడుతున్నదా తను? ఎట్లా అయితే అట్లా అవుతుంది. బ్రతకలేక పోను' అనుకొంది లలిత. "తెమిలి రావేమే ఆ వసారాలోనుండి?" అన్న తల్లి కేకతో అన్యమనస్కంగా లోనికి వెళ్ళింది లలిత.

* * *

పుట్టింటి కొచ్చినప్పటినుంచీ లలితకు కొత్త కొత్త అనుభవాలు ఎదురుకా సాగాయి. అవి తాను లోగడ ఊహించనివి, ఇప్పటి తన స్థితిని వేలెత్తి చూపి వెక్కిరించేవిను. తా నెంతగా ఇది తన ఇల్లని తలపోస్తున్నా, కాదు అనేంత వింతగా, విచిత్రంగా తన తోబుట్టువులే ప్రవర్తిస్తున్నారు. తనను పరాయిదానిగా, పనికిరానిదానిగా పరిగణిస్తున్నారు. నాక పోతే, మొన్నకాక మొన్న తాను వసారాలో కూర్చుని వార పత్రిక చదువుతున్నప్పుడు తన కంట పడరాదన్నట్లుగా, చేతుల వెనక దాచుకొని ఏదో పొట్లాన్ని లోపలికి తీసుకెళుతున్నాడు తన తమ్ముడు. తల పైకెత్తి చూసిన తాను ఉండబట్ట లేక "ఏమిట్రా అది?" అనడిగింది.

"నీకు చెప్పేది గాదులే" అంటూ లోని కెళ్ళాడు.

ఆ తరవాత తాను తెలుసుకొంది, అవి వాడి పెళ్ళానికి తెచ్చుకొన్న పూలని. వాడు పూలు తెచ్చుకొంటే తా నొద్దంటుందా? తన కంట పడితేనే అవి అపవిత్రమై పోతాయా? ఆ చిన్న విషయాన్ని తన నుండి వాడు దాచాలని ప్రయత్నించటం లలిత మనసును ముల్లుతో కెలికినట్లైంది. నిజానికి వీడికోసం తనెన్ని అవస్థలు పడింది? తన భర్త ప్రభాకరంతో ఎన్నెన్ని అబద్ధాలు చెప్పవలసి వచ్చింది? పిల్లలకోసం ఆయన కొంత డబ్బును కూడబెడితే, ఆ డబ్బును వీడు తీశాడు. డబ్బు పోయినందుకు గాక, వీడు తీయలేదని బుకాయించినందుకు ఆయన ఆగ్రహం చెందారు. తాను వీడిని సమర్థించింది.

"మీ తమ్ముణ్ణి వెనకేసుకురా. కాదనను. కానీ, అబద్ధాల్లోనూ, దొంగతనాల్లోనూ కాదు."

"అవసరముంటే తీశాడేమో, దీని కింత రాద్ధాంతం దేనికి?"

"అది పిల్లలకోసం దాచిన డబ్బు."

"పోతే పోయింది. ముష్టి మూడొందలు. నా జీతం నుండి నే నిస్తా లెండి."

ఎంత అహంకారంగా చెప్పింది తాను! ఆయనకు తెలియకుండా వీడు చేసిన ఎన్ని బాకీలు తీర్చింది తాను! ఆ కృతజ్ఞతైనా లేకుండా తన్నో పురుగును చూసినట్లు చూస్తాడా? పలకరిస్తేనే పాపమన్నట్లుగా దూరదూరంగా తప్పుకు తిరుగుతాడా? ప్రభాకరానికీ, తనకూ మనస్పర్థలు పెరగటానికి వీడు కాదూ కారణం? ఆ జ్ఞానమున్నా ఉండవద్దా మనిషికి?

లలిత మనసును కలచివేస్తున్నది మరో విషయం.

"వది నెప్పు డొస్తుందిరా?" అని పొద్దుట వా నడిగింది అప్పను.

"ఎప్పుడో వస్తుందిలే."

"అదేమిట్రా!"

## పి. వి. రమణి

"వచ్చి ఎక్కడుండాలి?"

"ఇది ఇల్లు కాదా?"

"ఇల్లే. కాని, చోటేది!" అంటూ వెళ్ళిపోయాడు! అంటే ఏమిటి వాడి ఉద్దేశ్యం! వాడి భార్యను తెచ్చుకోవటానికి కూడా తా నడ్డుగా ఉన్నాననే కదూ? తా నిక్కడికి కొచ్చిన కొత్తలో మళ్ళీ ఆ గడప తొక్కద్దని చెప్పింది వీడు గాదూ! ఆ అభిమానమంతా ఏమైనా? అమ్మ తన పిల్లల్ని చేరదీసిందని, ఆవిడ పేరు మీదున్న నాలు గెకరాలు తన పిల్లల పేర పెట్టిందని వీడి కోపం. దాన్ని బయటికి రానివ్వడు. మెత్తని కత్తి వంటిది వీడి స్వభావం. తానే తెలుసుకో లేకపోయింది. మరి తన కాపురాన్ని పాడు చెయ్యటంలో వీళ్ళింత ఆసక్తి దేనికి చూపారు? వీళ్ళ సానుభూతికోసం, తన ఉనికికోసం వచ్చిన కొత్తలో ప్రభాకరం మీద ఎన్నెన్నో ఆరోపణలు చేసింది తాను! లలితలోని వివేకం కొద్ది కొద్దిగా తలెత్తసాగింది. భర్తకు దూరమై తాను కోల్పోతున్న దేమిటో తెలుసుకో గలుగుతున్నది. అయినా, ఆమె మనసు చుట్టూ అల్లుకుపోయిన అసంతృప్తి, ఉద్రేకాల తాలూకు పొరల అవశేషాలు మాత్రం ఇంకా అట్లాగే ఉండిపోయాయి.

* * *

శూన్యంలోనికి చూపును గుచ్చి ఆలోచిస్తూ ఉండిపోయిన లలిత పద్మ రాకను గమనించలేదు.

"లలితా!"

తలెత్తి చూసింది లలిత.

"ఏమి టంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?"

"ఏమీ లేదు."

"నోరు అబద్ధం చెప్పినా కళ్ళు నిజమే చెబుతాయట. నా ముందు దాపరిక మెందుకు, లలితా?"

"ఏమిటే నీ వాదన? ఉబుసుపోక కూర్చొన్నాను తప్ప వేరేం లేదు."

"దానికి నా రాకను గూడా గమనించనంత పరధ్యాన్న మెందుకు?"

"నావే నీ కళ్ళ పరీక్షా, నీళ్ళూనూ."

"పోతున్నానమ్మా, పోతున్నాను. అది చెప్పడానికే వచ్చాను."

"ఈ రోజేనా?"

"ఈ రోజంటా కూడా కాదు. ఇప్పుడే."

మౌనంగా పద్మవైపు చూసింది లలిత. పద్మ కూడా దూరమవుతున్నందుకు ఏదో అశాంతి, ఆవేదన లలిత మనసును కమ్మివేశాయి.

"లలితా, నీ విషయంలోనూ అసంతృప్తిని, ఆవేశాన్ని పెంచుకోకు. అవి ఆవహిస్తే ఆ వలయం నుండి బయట పడటం కష్టం."

"ఎందుకు చెపుతున్నా విప్పుడు?"

"నీ శ్రేయస్సును గురించే."

"ఆశ లుండగానే సరిగాదు, అదృష్టం కలిసిరావద్దా?"

"ఏ అదృష్టమైనా నీ నిర్ణయాన్ని బట్టే ఉంటుంది, లలితా."

"ఏమి టది?"

"నీ ఇంటికి నువ్వు పోవటంలో నీ స్వత్వ కొచ్చే దేముంది?"

"నా మాటకు విలువ లేని చోటికి నేను పోయి ప్రయోజనం లేదు."

"విలువ ఒక రిచ్చేది కాదు, లలితా, మనం తెచ్చుకోవాలి గాని."

"ఒక వ్యక్తిగా అక్కడ నాకు విలువ లేదు. నేనంటే ఆయన కలుసు."

"లలితా, ఆవేశంతో నీ భర్తని గూర్చి నువ్వు చిత్రిస్తున్నదంతా నిజం కాదని నీకూ తెలుసు. నీ తల్లి, సోదరులూ నిన్నిక్కడ ఆదరించవచ్చు. అభిమానం చూపించవచ్చు. ఇది తలదాచుకోవటమే అవుతుంది గాని, తృప్తిగా జీవించటం మాత్రం కాదు. నీ ఇల్లు ఏనాటికైనా అదే. నీ మనసుకు, మనుగడకు నిండైన ప్రతినిధి నీ భర్తే."

"నీ సలహాకు థాంక్స్." పద్మ మాటలను మధ్యలోనే తుంచుతూ అంది లలిత.

స్నేహితురాలివైపు రెండు క్షణాలు నిర్వేదంగా చూసింది పద్మ. కలిసి చదివిన అనుబంధం పెంచిన ఆప్యాయత అది. ఆ అనుబంధమే పద్మ హృదయాన్ని

ఆవేదనలో కప్పివేసింది.

"వస్తా, లలితా" అంటూ లేచింది పద్మ. వెంట నడిచింది లలిత.

పద్మ ఆ వీథి మలుపు తిరిగేవరకూ ఆమెనే నిరామయంగా చూస్తూ నిలబడి, ఒక నిట్టూర్పు విడిచి వెనుదిరిగింది లలిత.

* * *

తన ముగ్గురు పిల్లలచేత వసారాలో పాఠాలను చదివిస్తున్న లలిత 'పోస్ట్' అన్న కేకతో తలఎత్తి చూసింది. తన పేరు మీదవే రిజిస్టర్ కవరు. కవరుమీది అక్షరాల్ని పరిశీలించి చూసింది. ఆ దస్తూరి తన భర్త ప్రభాకరందే. కవరు చేతిలోనికి తీసుకోగానే ఏదో ఆత్మీయత, అనుబంధాల తాలూకు స్మృతులు ఆమె నరాల్లో వెల్లువలా ప్రవహించినాయి. ఎంతకాలానికి తన భర్తనుండి మళ్ళీ తనకు లేఖ! తన భర్తే తనను చెయ్యెత్తి రమ్మని పిలుస్తున్నట్లుగా అనుభూతి కలుగుతున్నది. శరీరంలో ఏదో విచిత్ర మైన సందడి. మనసునిండా ఆర్ద్రత. హృదయంలో సంతోషం పొంగు.

"ఈ రసీదు మీద సంతకం పెట్టివ్వండమ్మా."

సిగ్గుపడింది లలిత తన పరధ్యానానికి, పరవశత్వానికి. సంతకం పెట్టి రసీదు ఇచ్చింది. పోస్ట్‌మన్ వెళ్ళిపోయాడు. పిల్లల్ని కూడా ఆడుకోమని పంపించి వేసింది. గంతులేస్తూ వెళ్ళారు వాళ్ళు.

కవరు చించుతూంటే వేళ్ళలో వణుకు. మనసులో ఏవో సంశయాలు. మెల్లిగా కవరు చించింది లలిత.

"లలితా!"

లలిత అణువణువునా పులకరింత. ఒక్కసారిగా ఆ ఉత్తరాన్ని తన గుండెలకు హత్తుకొంది. ప్రభాకర మింకా తనని మరిచిపోలేదు.

"ఇప్పుడు నిన్నెట్లా సంబోధించాలో కూడా తెలియకుండా ఉంది. అయినా, పది సంవత్సరాలు నాతో కలిసి మెలిసి జీవించావు కనక ఏకవచనం వాడాను. ఆగ్రహం తెచ్చుకోవనే ఆశ.

ఈ నాటికి నువ్వీ గడప దాటి ఆరు నెలలకు పైగా అయింది. ఇంతవరకు నీ నుండి ఎటువంటి లేఖ కూడా నా కందలేదు. అంటే, నేను బ్రతికానో, లేదో తెలుసుకోవాలన్న కోరిక కూడా నీకు లేదని స్పష్టమవుతున్నది. నా పై నువ్వు పెంచుకున్న పగ, ద్వేషం, అసహ్యాల తాలూకు మంటలు ఇంకా నీలో రాజు కొంటూనే ఉన్నాయని భావించవచ్చునా? నువ్వు నా భార్యవు. కష్టాల్లో, సుఖాల్లో నీడలా నన్ను అనుసరించి ఉండవలసిన దానివి. ఆ ఆశతోనే ఆ నాడు నీ మెడలో తాళి కట్టాను. నా మనిషిగా స్వీకరించాను.

కానీ, కష్టమొస్తే నువ్వీ గడప దాటటమనేది ఒక అలవాటుగా మారిపోయింది. ఇది తగదని ఎన్నోసార్లు బుజ్జగించాను; వారించాను. నువ్వు లక్ష్యపెట్టలేదు. నేనూ బాధలకు, కష్టాలకు అతీతంగా లేను. ఎన్ని ఇబ్బందు లొచ్చినా ఏనాడూ నే నీ గడప దాటి పోలేదు. కారణం? ఇది మన ఇల్లు. సుఖాలకూ, కష్టాలకూ నా దృష్టిలో ఇదే వారధి. నీ విషయం మాత్రం ఇందుకు విరుద్ధం. విచిత్ర మేమంటే, నా నుండి వెళ్ళిపోయి నువ్వా ఇంటికి చేరుతున్నా, ఇది తప్పని నీకు చెప్పేవాళ్ళుగాని, అసలేం జరిగిందని నా వద్దకు వచ్చేవాళ్ళు గాని అక్కడ లేరు. అది నీ అదృష్టమో, దురదృష్టమో ముందుకాలం నీకు నేర్పుతుంది. దీనిని బట్టి మనం కలిసి ఉండటంకన్నా, విడిపోవటాన్నే నీ తరపు పెద్దలు కోరుకుంటున్నారని అనుకోవాల్సి వస్తున్నది. ఇది అబద్ధం కానట్లు ఏడు పదుల పైబడి వయసున్న మీ అమ్మ లోగడ ఈ ఊళ్ళోనే నీ చేత వేరే కాపురం పెట్టించింది. అది భావ్యమైన పని కాదని, భవిష్యత్తుకు మంచిది కాదని నిన్ను ఈ ఇంటికి తీసుకువచ్చాను ఆ నాడు. ఆనా డేమిటి? నువ్వు నాకు చెప్పకుండా పోయిన ప్రతిసారీ అభిమానాన్ని చంపుకోనో, అనుబంధాన్ని తెంపుకోలేకనో నేనే నిన్ను తెచ్చుకొంటూ వచ్చాను. తిరిగి ఈ సారీ అదే పని చేయమంటావా నన్ను? అసలు భర్త అనేవాడు ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోతేనో, లేదా కంటికి కనిపించకుండా ఎక్కడైనా పారిపోతేనో ఆడవాళ్ళు పుట్టింటికి చేరతారు. ఆ గూడులో రక్షణ కోరతారు. కాని, నువ్వు చేస్తున్న దేమిటి? పైగా పోతూ పోతూ చుట్టుపక్కల నా మీద చెప్పరానంత అసహ్యమైన ప్రచారం చేసి పోయావు. నేను నిన్ను గొడ్డును బాదినట్లు బాది వెళ్ళగొట్టానా? అయినా, కొట్టుకోవటం, తిట్టుకోవటంలో మనం సమ ఉజ్జీలం. ఈ విషయంలో ఒకరికంటే ఒకరం తక్కువేం తినలేదు. నే నొక టంటే, పదంటావు. ఆవేశంలో ఒక దెబ్బ వేస్తే నాలుగు రెట్లుగా బదులుచెప్పి, అది చాల దన్నట్లుగా బజారున పడతావు. ఇంత అసహజంగా, పెద్దా చిన్నా భేదం లేకుండా నువ్వు ప్రవర్తిస్తూ వస్తున్నా, నీ పౌరుషం, మొండితనం నాకు తెలుసు కాబట్టి, ముందుముందు నీకే తెలిసొస్తుందిలే అని సరిపెట్టుకుంటూ వచ్చాను. అది నా అసమర్థతగా, చేతగాని తనంగా భావించి అలుసు తీసుకొన్నావు. అహంకారాన్ని పెంచుకొన్నావు. నా నుండి నీ కెటువంటి సుఖం లేదని, నా కోసం




అహింసామూర్తి

చిత్రం— గోలి శంకరరావు (హైదరాబాదు – 20

ఎంతో త్యాగం చేశావని ఇక్కడ చెప్పి వెళ్ళావు. కాదనను. నా కోసం ఉద్యోగం చేశావు. నీ డబ్బును ఖర్చుచేశావు. అయినా, భర్త కోసం భార్య చేసే సహకారం త్యాగమవుతుందా? ఇక నాకు సుఖాన్ని గూర్చి గాని, అది అందించే భోగాలను గూర్చిగాని తలపోసే అవకాశం లభించలేదు. లభించలేదే అన్న బాధా లేదు. మరి నీకు నే నందివ్వలేని సుఖ మేదో నువ్వే తరిచి చూసుకోవాలి.

నీకు నేను పనికిరానప్పుడు, నా మీద, నా మాట మీద ఏ విధమైన గౌరవాభిమానాలు నీకు లేనప్పుడు, నేను కట్టిన మాంగల్యాన్ని ఇంకా నా ప్రతినిధిగా నీ మెడలో ఉంచుకోవటంలో ఔచిత్య మేమిటి? దాని నీడలో నిన్ను నీవు రక్షించుకోవటం దేనికి? ఇది లోకాన్ని మభ్యపరచటం కాదా? ఆ మాంగల్యాన్ని కూడా తీసేసి, లేదా నా మొహాన విసిరేసి నిండైన నీ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకో. అప్పటికి గాని నాకు దూరంగా ఉండటంలోను, లేదా నన్ను సాధించటంలోని నీ ప్రయత్నం సంపూర్ణంగా ఫలించదు. నీ ప్రాణమంటూ నువ్వు చెప్పుకు తిరిగిన ఒక్క నీ స్నేహితురాలు కూడా నీ కాపురాన్ని నిలబెట్టాలనే ప్రయత్నంలో లేదా అక్కడ? ఒక వేడుకగా, వినోదంగా మన గొడవను గూర్చి చెప్పుకొంటూనే తృప్తి పడుతున్నారు వాళ్ళు. అర్థమైందా? వీళ్ళ ముందు కూడా నన్ను పలుచన చేస్తూ మాట్లాడావు అనేక పర్యాయాలు.

ఇంతకన్నా నేను వ్రాసేదిమాత్రమేముంది? నీ వివేక మెట్లా చెపితే అట్లా చెయ్యి. నాకు దూరంగా ఉండాలనుకొనే నీ అభిలాషను మెచ్చుకోలేకపోయినా, అందువల్ల అక్కడ నువ్వు పొందగలుగుతున్న సుఖానుభూతిని మాత్రం అడ్డురాదలుచుకోలేని —

నీ . . .

—ప్రభాకరం."

ఉత్తరం చదివిన లలిత కన్నుల నిండా నీరు. మనసులో శూన్యపు తెర. గుండెలో వేదన. నరనరాల్లో భయంతో నిండిన కంపన. కన్నీళ్ళు తుడుచుకొని, తిరిగి లేఖను చదవబోయింది లలిత.

"ఎవరు వ్రాశారే?" అంటూ తల్లి కటాక్షమ్మ ప్రవేశించింది.

"ఆయనే."

"రాశాడూ? రాయకేం చేస్తాడూ! ఎంత కాల ముంటుం దా బింకం?"

లలిత మాట్లాడలేదు. తల్లి లోపలి కెళ్ళిపోతే బాగుంటుం దనిపించిం దా క్షణంలో లలితకి.

"అయినా, ఏ ముఖం పెట్టుకుని ఈ రాతలు?"

"... ..."

"నిన్ను రమ్మన్నాడా?"

మన సెక్కడో పెట్టుకుని తల అడ్డంగా ఊపింది లలిత.

"భార్య నొదిలి ఒంటరిగాడు మాత్ర మెంతకాల ముంటాడు? ఒంటిగా ఉండాలనుకొంటే ఉండని. నీకుమాత్రం పోయిం దేమిటి?" లోపలి కెళ్ళింది కటాక్షమ్మ.

లలిత మనసుతో మరుగుతున్న వేదన. గుండెలు తొలుచుకు వస్తున్నట్టుగా క్షోభ. "ఇదీ తన బాధ" అని ఎవరికీ చెప్పుకోలేని బాధిత. ఉత్తరాన్ని మళ్ళీ చదవబోయింది. అక్షరాలన్నీ మసక మసకగా కనిపించసాగాయి. తన కళ్ళకు అడ్డంగా ఏదో తెర. కళ్ళు తుడుచుకొని ఉత్తరంలోకి చూస్తూ గుచ్చి ఉండిపోయింది లలిత.

* * *

ఆ రాత్రి లలిత పడుకొందన్న మాటే గాని, కంటిపై కునుకు లేదు. గతమంతా ఆమె మనోనేత్రం ముందు కదులుతున్నది. తన కాపురాన్ని తాను పెళ్ళగించుకొని, భర్తతో తెగతెంపులు చేసుకొని తా నొచ్చిన నాడు తన తెగువ తనాన్ని అందరూ మెచ్చుకున్నా రిక్కడ. తన తల్లి పిత్యాను సరేసరి. కాని, ఇప్పుడు? భరించలేక తప్పదన్నట్లుగా, అంతకు మించి మరే అనుబంధమూ లేదన్నట్లుగా ప్రవర్తించే అన్నదమ్ములు, "నీ కిక్కడే రాసిపెట్టి ఉంటే ఉండకేం చేస్తావు?" అన్నట్లుగా చూసే తల్లి — ఇదేనా తా నాశించిన జీవితం? ఇందుకేనా తా నిక్కడికి వచ్చింది? పోనీ, ప్రభాకరం దగ్గరకు వెళితే? తన తొందరపాటును మన్నించమని ముందుగా ఒక లేఖ వ్రాస్తే? ఊహూం వీల్లేదు. తన బ్రతుకు మరీ హీనమవుతుంది. ఆయన రమ్మన్నప్పుడల్లా రావటానికి, పొమ్మన్నప్పుడల్లా పోవటానికి తనేం మనసు లేని మరబొమ్మ కాదు. ఆయన అవమానించినప్పుడు ఏడవటానికి, అభిమానించినప్పుడు పొంగిపోవటానికి తనేం పాతకాలపు ఆడదీ కాదు. అనురాగం, ఆత్మీయత అనేవి రెండు వైపులనుండీ రావాలి. తన ఉనికినే మరిచి ఆయన ప్రవర్తిస్తున్నప్పుడు తను మాత్రం ఇంతకన్నా ఏం చేయగలదు? అసలు ఒకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతకాల్సిన అవసరం తనకేం లేదు. తనకూ డిగ్రీ ఉంది. ఒక అయిదారేళ్ళు పోతే పిల్లలు పెద్దవాళ్ళు కాకపోరు. ఎంత మరిచిపోదామన్నా ప్రభాకరం లేఖ లోని ఒక విషయం లలిత మనసును కెలుకుతూనే ఉంది. ఆమె గుండెల్లో రొద పెడుతూనే ఉంది. "నా మాంగల్యాన్ని నాకు విసిరేసి నీ వ్యక్తిత్వాన్ని పెంచుకో" అని వ్రాస్తాడా? ఏం? అసలు

### వైరుధ్యం

స్త్రీ శాసిస్తున్నదంటే అంతర్యంలో విధేయురాలనే అర్థం. స్త్రీని లోబరచుకోవడానికి పురుషుడు ఆమెకు దాసోహం అనడం ఒక్కటే సరైన మార్గం.

—వర్గాక్

### భర్తృస్నేహం

వివాహం అయిన స్త్రీకి భర్త ఒక్కడే మంచి స్నేహితుడు. అతనిని కాదని మరొక స్త్రీతో స్నేహం చేసిందంటే ప్రమాదమే.

—డెలూజీ

ఆధిపత్యం చూపటానికీ, తాను అడిగి మరీ బ్రతకటానికీ ఆ మాంగల్యమే కారణమని అతని ఉద్దేశ్యమా?

తన భర్త ప్రభాకరమే తాడెత్తు పెరిగి తన ముందు నిలబడి, తన మెడలోని మంగళసూత్రాన్నే వేలుపెట్టి చూపిస్తున్నట్లు, వెర్రిగా నవ్వుతున్నట్లు, వెంటనే తన మెడలోనుండి తీసివేయమంటూ కళ్ళెర్ర చేసినట్లు అనిపించసాగింది లలితకు. శరీరమంతా కంపరం కలిగినట్లైంది లలితకు. వేళ్ళు వణుకుతున్నా, ఆ మంగళసూత్రాన్ని తీసి దిండు క్రింద పెట్టి బలవంతాన కళ్ళు మూసుకొంది లలిత.

తెల్లవారుజాము నెప్పుడో కునుకు పట్టింది లలితకు. 'టెలిగ్రామ్' అన్న పిలుపు వింటూనే లేచి కూర్చుంది. కాకీ దుస్తుల్లో కనిపించిన టెలిగ్రామ్ మెసెంజర్‌ని చూసిన లలిత మనసులో ఏదో శంక. టెలిగ్రామ్ తీసుకొంది. మెసెంజర్ వెళ్ళిపోయాడు. కవరు చించి, చెదురుతున్న దృష్టిని కూడగట్టుకొని చదివింది లలిత.

"ప్రభాకరం డైడ్ లాస్ట్ నైట్ డ్యూ టు హార్ట్ ఎటాక్." తన గుండె నెవరో పీకి దూరంగా విసిరివేసినట్లుగా ఒక్క పొలికేక పెట్టి త్రుళ్ళిపడి లేచి కూర్చుంది లలిత. 'ఇదంతా అబద్ధం. నా ప్రభాకరం నన్ను విడిచిపెట్టి పోడు, ఎప్పటికీ పోడు' అంటూ ఆయాసపడుతుండగా చుట్టూ చూడసాగింది లలిత. అప్పటికే తన చుట్టూ చేరిన తల్లిని, సోదరుల్ని చూసి బావురుమంది లలిత. కూతుర్ని పొదివి పట్టుకొని, "ఏమైనా కలగన్నావుటే?" అని ప్రశ్నించింది కటాక్షమ్మ. సమాధానంగా తల ఊపి ముఖాన్ని చేతుల్లో దాచుకొని ఏడవసాగింది లలిత. [illegible] కూతురు [illegible] సవరించింది కటాక్షమ్మ. ఎవరో వీపు మీద చరిచినట్టు ఉలిక్కిపడి దిండుక్రింద ఉంచిన మంగళసూత్రాన్ని తీసి కళ్ళకద్దుకుని మెడలో వేసుకొంది లలిత. కూతురు చర్యను ఆశ్చర్యంతో గమనిస్తూ ఉండిపోయింది కటాక్షమ్మ.

* * *

ఆ ఉదయమే తన సామానంతా సర్దుకో సాగింది లలిత. "ఎందుకే ఇప్పు డవి సర్దటం?" అంటూ కటాక్షమ్మ ప్రవేశించింది.

"ఈ పది గంటల బండికే నే వెళ్ళిపోతున్నా నమ్మా."

"ఎక్కడికి?"

"నా ఇంటికి."

"అంటే?"

"నా భర్త దగ్గరికమ్మా?"

"ఇంత అర్జాంతరంగా ఎందుకే?"

"ఇప్పటికే ఆలస్యమై పోయిందమ్మా."

"అతగాణ్ణే రానీ ఇక్కడకు. నువ్వెందుకు పోవాలి?"

"తప్పుచేసింది నేను. దిద్దుకోవాల్సిందీ నేనే నమ్మా."

"నువ్వు నా మాట వింటావు గనకనా! నీ కెంత తోస్తే అంతే." గొణుగుతూ వెళ్ళిపోయింది కటాక్షమ్మ.

'భర్తకు దూరమైన స్త్రీ బ్రతుకేమిటో అనుభవించానమ్మా' అని మనసులో అనుకుంటూ పిల్లలకు తల దువ్వసాగింది లలిత. ఎందుకో పదే పదే పద్మ గుర్తుకు రాసాగింది లలితకు. 'నిజమైన స్నేహితురాలివంటే నీవే. నీ మాటల్ని ఆ నాడు అర్థం చేసుకోలేకపోయాను. నన్ను మన్నించు' అంటూ మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొంది పద్మకు.

రైల్లో కూర్చున్న లలిత మనసులో సవ్వడి ప్రశ్న లేదు. పంతాలూ పట్టింపులూ లేవు. ఒకే ఒక్క కోరిక మాత్రం ఉంది. 'మనసు పోయేంత వేగంగా రైలు కూడా సాగగలిగితే ఎంత బాగుండు!' అన్నదే అది. ★